## క్లుప్తంగా

### నేటి నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు

రాజేంద్రనగర్: అత్తాపూర్ చిన్న అనంతగిరి శివాలయంలో ప్రణవ భక్త సమాజం ఆధ్వర్యంలో 48వ మహాశివరాత్రి మహోత్సవాలను శుక్రవారం ప్రారంభించనున్నట్లు ప్రణవ భక్త సమాజం సభ్యులు వెల్లడించారు. నేటి నుంచి 19వ తేదీ వరకు ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు వివిధ పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మహాశివరాత్రి రోజు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కాశీలింగాలకు అభిషేకం నిర్వహిస్తామన్నారు.

### నేడు మెగా రక్తదాన శిబిరం

గచ్చిబౌలి: సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం కొండాపూర్ ఏరియా ఆస్పత్రిలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ఆస్పత్రి ఆవరణలో శిబిరం ప్రారంభమవుతుందని శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని అన్ని డివిజన్లకు చెందిన ఔత్సాహిక రక్త దాతలు రక్తదానం చేయాలని కోరారు. శేరిలింగంపల్లిలో మూడు రోజులపాటు కేసీఆర్ జన్మదిన వేడుకలను ప్రత్యేక సంబరాలుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు.

### హెచ్‌సీయూలో సింపోజియం ప్రారంభం

రాయదుర్గం: స్థానిక సవాళ్లను స్వీకరించి ప్రపంచ నాయకత్వాన్ని సాధించాలని సీఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్ ఎన్ కలైసెల్వి పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఇండియా హైదరాబాద్ చాప్టర్, అకాడమీ ఫర్ సైన్స్ టెక్నాలజీ అండ్ కమ్యూనికేషన్, హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ ఆధ్వర్యంలో డాక్టర్ జాకీర్ హుస్సేన్ లెక్చర్ హాల్ కాంప్లెక్స్‌లో 'ఎలక్ట్రానిక్స్ ఫర్ సెల్ఫ్ రిలయన్స్' అనే అంశంపై రెండురోజుల సింపోజియం ప్రారంభించారు. భారతదేశంలోని వివిధ సీఎస్ఐఆర్ ల్యాబ్‌ల ప్రధాన విజయాలను ఆమె వివరించారు. ఐఐటీ న్యూఢిల్లీ మాజీ డైరెక్టర్ పిళ్లే చైర్ ప్రొఫెసర్ వి రాంగోపాల్‌రావు మాట్లాడుతూ విద్యాసంస్థల్లో వినూత్న సాంకేతికతల పర్యావరణ వ్యవస్థను స్థాపించడం, విద్యారంగంలో స్టార్టప్‌లను ఏర్పాటు చేయడం యొక్క ప్రాముఖ్యతను చెప్పారు.

### 'యూనిఫామ్ సివిల్ కోడ్ అమలు కష్టం'

రాయదుర్గం: విభిన్న సంస్కృతులు, సాంప్రదాయాలు ఉన్న భారతదేశంలో యూనిఫామ్ సివిల్ కోడ్‌ను అమలు చేయడం చాలా కష్టమైన పని అని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా మాజీ వైస్‌చాన్స్‌లర్, అలీఘర్ ముస్లిమ్ యూనివర్సిటీ న్యాయ విభాగం ప్రొఫెసర్ ఫైజాన్ ముస్తఫా అన్నారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని మహిళా విద్యా విభాగం(డీడబ్ల్యూఈ) ఆధ్వర్యంలో సుఘ్రా హుమాయున్ మీర్జా స్మారక ఉపన్యాస కార్యక్రమాన్ని గురువారం 'భారత రాజ్యాంగం, లింగ సమానత్వం, యూనిఫామ్ సివిల్ కోడ్' అనే అంశంపై వీసీ ప్రొ.ఐనుల్ హసన్ అధ్యక్షతన నిర్వహించారు. గతంలో మహిళలు విద్య అభ్యసించడం చాలా కష్టమైన పని అని, హుమాయున్ మీర్జా బాలికలు, మహిళలను విద్యలో ప్రోత్సహించారన్నారు. ఉర్దూ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్ మాట్లాడుతూ బాలికలు, మహిళల విద్యా కార్యక్రమాలకు ఉర్దూ విశ్వవిద్యాలయం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో డీడబ్ల్యూఈ ప్రొగ్రామ్ కోఆర్డినేటర్ హెడ్ డాక్టర్ అమీనాత హసీన్, సఫ్దరియా బాలికల ఉన్నత పాఠశాల కార్యదర్శి, కోఆర్డినేటర్ హుమాయున్ అలీ మీర్జా ప్రసంగించారు. అనంతరం సుఘ్రా హుమాయున్ మీర్జా జీవితంపై డాక్యుమెంటరీని ప్రదర్శించారు.

### 'మౌలిక వసతుల కల్పనలో ఎమ్మెల్యే విఫలం'



గచ్చిబౌలి: శేరిలింగంపల్లిలో కనీసం మౌలిక వసతులు కల్పించడంలో ఎమ్మెల్యే గాంధీ పూర్తిగా విఫలమయ్యారని బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ అన్నారు. గురువారం శ్రీరామనగర్ కాలనీ శక్తి కేంద్ర కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్ హయాంలో శ్రీరామ్‌నగర్ కాలనీ ఇళ్ల స్థలాలకు జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులతో మాట్లాడి పట్టాలను ఇప్పించడం, 120 అడుగుల రోడ్డు విస్తరణ చేయించగా ఇప్పటి వరకు గాంధీ పూర్తి చేయలేదని విమర్శించారు. ఒక రూపాయికి నల్లా కనెక్షన్ అని చెప్పి వేల రూపాయల బిల్లులు వసూలు చేశారని, స్థలాల సుందరీకరణ పేరుతో చెరువుల కబ్జాకు పాల్పడటం తప్ప చేసింది ఏమీ లేదన్నారు. భారత్‌ను శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. ప్రతి కార్యకర్త కేసీఆర్ అవినీతిని ఇంటింటికీ తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎల్లేష్, రాజుశెట్టి, కాంచనకృష్ణ, అనంతరెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, రమేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

# వైభవంగా అన్నపూర్ణాదేవి విగ్రహ ప్రతిష్ఠాపన



ఆలయ గోపుర శిఖరంతో ప్రదక్షిణలు చేస్తున్న మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేందర్ దంపతులు



ప్రతిష్ఠాపన పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: శ్రీ కాశీ విశ్వేశ్వరుని పుష్కర కుంభాభిషేక సహిత శ్రీ అన్నపూర్ణాదేవి విగ్రహ ప్రతిష్ఠ మహా కుంభాభిషేక మహోత్సవం అంగరంగ వైభవంగా ముగిసింది. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడ శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ పూజల్లో చివరిరోజు గురువారం ఉదయం 7గంటల నుంచి స్వస్తి వాచనము, స్థాపిక దేవత పూజలు, బ్రహ్మశిలా సంస్కారం తదితర పూజలు నిర్వహించి ఉదయం 8.47గంటలకు అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం ప్రాణప్రతిష్ఠ, ,జయాది హోమం, బలిప్రదానం, పూర్ణాహుతి, మహా కుంభాభిషేకం నిర్వహించారు. ప్రతిష్ఠాపన పూజల్లో స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, మణికొండ మున్సిపల్ చైర్మెన్, ఆలయ ధర్మకర్త కస్తూరి నరేందర్‌ముదిరాజ్, బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ తలారి మల్లేశ్, మాజీ సర్పంచ్‌లు కస్తూరి బాల్‌రాజ్ ముదిరాజ్, యాలాల నరేష్, కౌన్సిలర్‌లు, వివిధ పార్టీల నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీగా అన్నదానం చేశారు.



అన్నపూర్ణాదేవిని ప్రతిష్ఠించిన కస్తూరి వంశీయులు



ఆలయ ఆవరణలో జయాదిహోమంలో పాల్గొన్న భక్తులు

## కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డికి సన్మానం



కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న అత్తాపూర్ బీజేపీ నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి: బీజేపీని రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మరింత పటిష్ట పరిచేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త విస్తృతస్థాయిలో పని చేయాలని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ విప్‌గా మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం ఆయన కార్యాలయంలో అత్తాపూర్ డివిజన్ పార్టీ ప్రధాన కార్యదర్శి సాయియాదవ్, యువమోర్చా అధ్యక్షులు సులిగె మణికంఠ, డివిజన్ మీడియా కన్వీనర్ మిద్దెల ఉపేందర్‌లు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### హైదర్‌గూడలో నగర సంకీర్తన



రాజేంద్రనగర్: అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ ప్రాంతంలో ఏకాదశి సందర్భంగా గురువారం నగర సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ ప్రణవ భక్త సమాజం ఆధ్వర్యంలో ఉదయం 5.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఈ కార్యక్రమాలు జరిగాయి. అనంతరం ఉదయం 9 గంటలకు భగవద్గీత పారాయణం చేశారు. బస్తీలలో ఊరేగింపు నిర్వహించారు.

## అందుబాటులోకి డీసీపీ కార్యాలయం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ డీసీపీ కార్యాలయం గురువారం నుంచి అందుబాటులోకి వచ్చింది. నిన్నటి వరకు శంషాబాద్ డీసీపీ కార్యాలయంలో ఉన్న ఈ కార్యాలయాన్ని రాజేంద్రనగర్ ఎన్‌సీసీ ప్లే గ్రౌండ్ ప్రాంతంలో కొత్తగా నిర్మించిన భవనంలోకి తరలించారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రాజేంద్రనగర్ డివిజన్ డీసీపీ జోన్‌ను ఏర్పాటు చేసింది. ఈ మేరకు గురువారం నుంచి నూతన కార్యాలయంలో తన పరిపాలన వ్యవహారాలను ప్రారంభించింది. ఎమ్మెల్సీ కోడ్ ఉండడంతో ఎలాంటి ప్రారంభోత్సవాలు చేయలేదని అధికారులు తెలిపారు. డీసీపీగా జగదీశ్వర్‌రెడ్డి కొనసాగుతున్నారు.



రాజేంద్రనగర్ నూతన డీసీపీ కార్యాలయ భవనం

### బీజేపీ డివిజన్ ఉపాధ్యక్షుడిగా శ్రీధర్

మైలార్‌దేవ్‌పల్లి: బీజేపీ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ఉపాధ్యక్షుడిగా టి.శ్రీధర్ ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి గురువారం నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి పని చేస్తానన్నారు.



నియామకపత్రం అందుకుంటున్న శ్రీధర్ ముదిరాజ్

### అక్రమ నిర్మాణాల కూల్చివేత



కూల్చివేసిన షెడ్‌లు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ హనుమాన్‌నగర్‌లో అక్రమంగా నిర్మిస్తున్న షెడ్లను గురువారం అపార్డ్, ఈటీపీసీ అధికారులు కూల్చివేశారు. అపార్డ్‌కు చెందిన స్థలంలో తాత్కాలిక షెడ్‌లు ఏర్పాటు చేస్తున్నారని సెక్యూరిటీ సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసుల సమక్షంలో షెడ్‌లను కూల్చివేశారు. అయితే వీటిని నిర్మిస్తున్న వారు ఎవరనేదానిపై స్పష్టత లేదని అధికారులు తెలిపారు. వివరాలు తెలుసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చెప్పారు.

### కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

శంషాబాద్: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శంషాబాద్ పట్టణంలోని ఆర్‌బీనగర్ కాలనీలో నివసించే ఆర్.రాజేష్(28) బుధవారం రాత్రి కుటుంబ సభ్యులతో గొడవపడ్డాడు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతడు పురుగుల మందు కొనుగోలు చేసి వైన్స్ షాపు వద్దకు వెళ్లాడు. వైన్స్ వెనుక వైపు ఉన్న పర్మిట్ రూంలో పురుగుల మందు తాగి స్పృహతప్పి పడిపోయాడు. గమనించిన నిర్వాహకులు పోలీసులకు సమాచారం అందించగా ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం రాజేశ్ చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చికిత్స పొందుతున్న ఇద్దరు మృతి

మైలార్‌దేవ్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోచోటు చేసుకుంది. వివరాల ప్రకారం శర్మకాలనీకి చెందిన మహ్మద్ హబీబ్(68) ఈ నెల 2వ తేదీ సాయంత్రం 5 గంటల ప్రాంతంలో తన ద్విచక్ర వాహనంపై ఉడ్డంగడ్డ రైల్వే స్టేషన్ ప్రాంతంలో వెళ్తుండగా బైక్ స్కిడ్ అయి కిందపడిపోయాడు. స్థానికులు చికిత్స కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

**మరో ఘటనలో..**

ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్న ఘటనలో మహిళ మృతి చెందిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయిబాబానగర్ ప్రాంతానికి చెందిన తస్లీమ్‌బేగం(45)కు గత ఐదు సంవత్సరాల క్రితం ఉస్మాన్‌తో వివాహం అయింది. గొడవల కారణంగా గత కొంత కాలంగా అమ్మగారి ఇంట్లో ఉంటూ ప్రైవేటు కంపెనీలో పని చేస్తుంది. ఈ నెల 11వ తేదీ డ్యూటీకి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చి ఒంటిపై కిరోసిన్ పోసుకోని నిప్పంటించుకుంది. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలి

యాకుత్‌పురా: అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గం పరిధిలోని తలాబ్‌చంచలం డివిజన్‌లో నషేమాన్‌నగర్, భవానీనగర్, చాచా గ్యారేజ్ తదితర ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఆయన కార్పొరేటర్ సమీనా బేగంతో కలసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ పార్టీ అధినేత ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. కొన్ని రోజులుగా నెమ్మది సాగుతున్న నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించామన్నారు. మజ్లిస్ పార్టీ అమన్‌నగర్–బి అధ్యక్షుడు మహ్మద్ మొహినుద్దీన్, నాయకులు మహ్మద్ అలీఖాన్, జాఫర్, జీహెచ్ఎంసీ, జలమండలి విభాగాల అధికారులు పాల్గొన్నారు.

### ఆలయ పునఃనిర్మాణానికి భూమి పూజ

శంషాబాద్: పట్టణంలోని తొండుపల్లి చెరువు వద్ద ఉన్న మైసమ్మ ఆలయ పునఃనిర్మాణానికి గురువారం స్థానికులు భూమి పూజ చేశారు. ఆలయాన్ని పెద్దగా కట్టేందుకు తొండుపల్లి, ఊటపల్లి, బస్తీలవాసులతో పాటు మత్స్యకారులు నిర్ణయించారు. ఈ మేరకు పనులను మొదలు పెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.



ఆలయ పునఃనిర్మాణానికి భూమిపూజ చేసిన స్థానికులు

# శివోహం ఆర్ట్ పోటీలు ప్రారంభం



శివోహం చిత్రలేఖనం పోటీలను ప్రారంభించిన అతిథులు

మణికొండ: శివరాత్రిని పురస్కరించుకుని శివోహం పేరిట మణికొండ మున్సిపాలిటీ, సెక్రటేరియట్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో గురువారం పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలలో మొత్తం 28 మంది కళాకారులు శివుడి బొమ్మలు గీస్తారని ఉత్తమ చిత్రాలకు బహుమతులను అందిస్తామని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డి. మనోహర్ తెలిపారు. ఈ పోటీలు గురు, శుక్ర వారాలలో జరుగుతాయని, శనివారం శివరాత్రి రోజు బహుమతులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో డా.శివనాగిరెడ్డి, బి.బాపూజీ, రాంప్రతాప్, శివరామకృష్ణ, డాక్టర్ నవీన్‌కుమార్, బి.రాంమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. దీంతో పాటు మెడికవర్ ఆసుపత్రి వారు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పలువురు రక్తదానం చేశారు.

## కుష్ఠువ్యాధిపై అవగాహన కల్పించాలి



కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ అన్నమ్మ ఎస్ జాన్

మైలార్‌దేవ్‌పల్లి: కుష్ఠు వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని డాక్టర్ అన్నమ్మ ఎస్ జాన్ అన్నారు. జాతీయ కుష్ఠువ్యాధి నివారణలో భాగంగా శివరాంపల్లి యూపిహెచ్‌సి కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. శరీరం స్పర్శ కోల్పోయినప్పుడు లేత గోధుమరంగు, ఎర్రటి మచ్చలు వస్తే డాక్టర్లను సంప్రదించాలన్నారు. చర్మంపై మచ్చలు మందంగా ఏర్పడి మెరుస్తు జిడ్డుకారుతూ ఇబ్బందికరంగా ఉంటాయని తెలిపారు. వెంటనే వైద్యం చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ గౌరీ, డాక్టర్ బోగ స్వాతి, భాగ్యలక్ష్మి, పద్మ, జెస్సీ, ప్రవల్లిక, మైనా, మీనా, సువర్ణ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

శంషాబాద్ రూరల్: మండల పరిధిలోని చిన్నగోల్కొండ గ్రామంలోని శ్రీ కాశీ విశ్వేశ్వరాలయంలో శివలింగం, నంది విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. విద్యాగణేశానంద సంస్థానాదీశ్వరులు భారతి మహాస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ఈ సందర్భంగా భారతి మహాస్వామి మాట్లాడుతూ ఆధ్యాత్మికతతోనే ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గుర్రం పద్మావతి అనంతరెడ్డి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.



పూజ చేస్తున్న విద్యాగణేశానంద భారతి మహాస్వామి



కార్యక్రమంలో మాట్లాడుతున్న నాయకులు

### బీజేపీ కార్నర్ మీటింగ్

రాజేంద్రనగర్: బుద్వేల్ శివాలయం వద్ద గురువారం రాత్రి బీజేపీ ఆధ్వర్యంలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. పార్టీ నాయకుడు మూల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మూడు బూత్‌లకు చెందిన ప్రజలు, నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాజిగిరి పార్లమెంట్ కోకన్వీనర్ భాస్కర్, జిల్లాపార్టీ ఇన్‌చార్జీ వై.శ్రీధర్ హాజరయ్యారు. కార్యక్రమంలో పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు బాబురావు, సాయి, సందీప్, శ్రీనివాస్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### ఎంజీఐటీలో చిత్రలేఖనం పోటీలు

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జీ20 ప్రెసిడెన్సీలో భాగంగా వసుధైక కుటుంబం, ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు అనే అంశంతో చిత్రలేఖన పోటీలను గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా పోటీలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఇంచార్జి జి.బాల్‌రెడ్డి, డాక్టర్ రవిచంద్ర, కేసీ సబిత, సాయి చరణ్, పావని, స్నేహిత, హర్షిత, అరవింద్ పాల్గొన్నారు.



చిత్రలేఖనం పోటీలలో పాల్గొన్న విద్యార్థులు



జగదీశ్వర్‌ను సన్మానిస్తున్న అధికారులు, ఉద్యోగులు

### రిటైర్డ్ ఉద్యోగికి సన్మానం

రాజేంద్రనగర్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్ ఆర్.జగదీశ్వర్ పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా మొక్కజొన్న పరిశోధన కేంద్రంలో పనిచేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ నాగేష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ రెహమాన్, డాక్టర్ సమీర్‌కుమార్, డాక్టర్ సునీల్, ఎస్.అమృత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో 'టిఫా' సేవలు



గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో మరిన్ని అత్యాధునిక వైద్య పరికరాలు అందుబాటులోకి రానున్నాయని గోల్కొండ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్ ఉల్లా అన్నారు. గురువారం ఆయన గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో టిఫా యంత్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కార్వాన్ నియోజకవర్గంలో ఉన్న ఏకైక గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో గర్భిణులకు మరిన్ని మెరుగైన వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. ఈ టిఫా యంత్రం ద్వారా 18 నుంచి 20 వారాల లోపు గర్భిణులకు పరీక్షలు నిర్వహించాలని, దీనివల్ల గర్భస్థ శిశువు ఆరోగ్య వివరాలు ప్రారంభం దశలోనే వైద్యులు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఎముకలు, గుండె, కాలేయం ఇతర ప్రధాన అంగాల ఎదుగుదల, సమస్యలు తెలుసుకుని దానిని పరిష్కరించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ పరీక్షలు ప్రైవేటు ఆస్పత్రుల్లో సుమారు రూ.4 వేలు అవుతాయన్నారు. రేడియాలజిస్టుల అందుబాటును చూసుకుని గర్భిణులకు ఈ పరీక్షలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి మెడికల్ ఆర్ఎంఓ డాక్టర్ రవూఫ్, ఏఓ శ్రీనివాసరావు, డాక్టర్ సౌజన్య, శ్రీలక్ష్మి తదితరులున్నారు.